క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయ స్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పైపులైన్లకు మరమ్మతులు

పాములపాడు: మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ కాలనీలోని పైపులైన్లకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచు మేకల భాగ్యమ్మ మాట్లాడుతూ రెండు రోజులుగా పైప్‌లైన్ లీకేజీ అవ్వడం వల్ల గ్రామంలో నీటిసరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు పైపులైన్లు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించామని చెప్పారు.

హెడ్‌రెగ్యులేటర్ వద్ద చేపలు పడితే ఉపేక్షించం



హెడ్‌రెగ్యులేటర్ వద్ద వలలు తీయిస్తున్న పోలీసులు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద మత్స్యకారులు ఎవరైనా చేపలుపడితే ఉపేక్షించేదిలేదని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. చాబోలు గ్రామానికి చెందిన ఇరువర్గాల మత్స్యకారులు చేపలు పట్టుకునే విషయంలో వాగ్వాదానికి పాల్పడిన నేపథ్యంలో గురువారం ఎస్‌ఐ వారిని స్టేషన్‌కు పిలిపించారు. వారితో మాట్లాడి సామరస్యంగా చేపలుపట్టుకోవాలని సూచించారు. అందుకు ఓ వర్గం అంగీకరించగా మరోవర్గం వారు స్టేషన్ వద్ద నుంచి వెళ్లిపోయారు. దీంతో హెడ్‌రెగ్యులేటర్ వద్ద ఎవ్వరూ చేపలుపట్టుకోవద్దని చెప్పారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద మత్స్యకారులెవ్వరూ చేపలుపట్టరాదని హెచ్చరిస్తూ.. అక్కడ చేపలుపట్టే వారిని పంపివేశారు.

రూ.1.30 లక్షల విరాళాల సేకరణ

మహానంది: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మహానంది గ్రామ పంచాయతీ నుంచి రూ.1.30 లక్షలు విరాళాలు సేకరించినట్లు టీడీపీ నాయకుడు సూరె శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక నాయకులు గంగిశెట్టి మల్లికార్జున, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ గౌడ్‌తో కలిసి విరాళాలు సేకరించారు. తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కామేశ్వరిదేవికి పట్టువస్త్రాల సమర్పణ

మహానంది: మహానందిలో అక్టోబర్ 3వ తేదీ నుంచి జరగనున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకామేశ్వరిదేవి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు గురువారం పట్టువస్త్రాలు సమర్పించినట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.గురువారం దాతలు అమ్మవారి మూల మూర్తులకు అలంకరించేందుకు పట్టువస్త్రాలను ఏఈఓ మధు, వేదపండితులకు అందజేశారు. వారణాసి రామ్మోహన్‌రావు దంపతులు గత 20ఏళ్ల నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.

వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలి

నందికొట్కూరు: వీధి కుక్కల నుంచి పట్టణ ప్రజలను రక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బేబికి సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శాంతి టాకీస్, ట్యాంకు ఏరియా, ఎస్‌ఎస్‌ఆర్ నగర్, హాజీ నగర్, సాయిబాబాపేట, సంగయ్యపేట, అల్లూరు రోడ్డు,ఏబీఎం పాలెంలో రోడ్లపై కుక్కలు గుంపులుగా చేరి మనుషులను కరుస్తున్నాయన్నారు. రాత్రి తొమ్మిది గంటల సమయం దాటితే ఇంటికి వెళ్లేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఆయా కాలనీల ప్రజలు అబ్దుల్ రషీద్, షేక్ ఫరీద్, దూదేకుల బాలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొత్తపల్లి: అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు జి.దాసు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని శివపురం గ్రామ సచివాలయంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి అజ్మత్‌లకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. నాగన్న, స్వామినాథం, స్వాములు, ఇమ్మానుయేలు, పాపన్న పాల్గొన్నారు.

వసతి.. అధోగతి

- హాస్టళ్లలో కనీస సౌకర్యాలు మృగ్యం
- రెండు నెలల క్రితం చెడిపోయిన మినరల్ వాటర్ ప్లాంట్
- బోరు నీటిని తాగుతున్న విద్యార్థులు
- బాత్‌రూమ్‌లకు డోర్‌లు లేక దుప్పట్లు అడ్డుకుంటున్న వైనం
- కిటికీలు ధ్వంసం కావడంతో దోమల బెడద, చలితో చిన్నారుల ఇబ్బందులు
- పరిసరాల్లో లోపించిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని ప్రభుత్వం



ఆత్మకూరులో అసంపూర్తిగా అదనపు గదులు

ఆత్మకూరు: పట్టణ సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సమీకృత వసతిగృహం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది.సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో దోమల బెడద, మంచినీటి సౌకర్యం లేక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వసతిగృహంలో మినరల్ వాటర్ ప్లాంటు ఉన్నప్పటికీ రెండు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో బోరు నీటిని తాగుతున్నారు. వసతిగృహంలో బండపరుపు కుంగిపోవడంతో అందులోంచి విషపురుగులు వస్తున్నాయి. అయితే విద్యార్థులు వాటిపైనే అలాగే నిద్రిస్తున్నారు. కిటికీల అద్దాలు పగిలిపోవడంతో వర్షపు నీరు కిటికీల నుంచి లోపలికి వస్తున్నాయి. ఇక చల్లటి గాలులకు తాళలేకపోతున్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లకు తలుపులు పూర్తిగా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి దుప్పట్లను అడ్డుగా కట్టుకుంటున్నారు. వంటగది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షపు నీరు వెలుస్తుంది. అలాగే డైనింగ్ హాల్ కూడా వెలుస్తుండటంతో గదుల్లోకి వెళ్లి భోజనం చేస్తున్నారు. ఈ వసతి గృహంలో 57 మంది విద్యార్థులు ఉన్నారు. ఆత్మకూరుతో పాటు కొత్తపల్లి, పాములపాడు, డోన్ ప్రాంతం నుంచి వచ్చి వసతి పొందుతున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఎలాంటి ఆట స్థలం లేదు. ప్రహరీ లేదు. ప్రస్తుతం వర్షపునీరు హాస్టల్ ముందు నిల్వ ఉంటుండటంతో అందులోనే రాకపోకలు సాగిస్తున్నారు.

హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థుల అవస్థలు

నందికొట్కూరు: నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గురుకులం, మోడల్ స్కూల్స్, కస్తూర్బా హాస్టళ్లలో వసతుల లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నందికొట్కూరు పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ప్రీమెట్రిక్ -40 మంది , బీసీ సంక్షేమ హాస్టల్స్ బ్రాహ్మణకొట్కూరు-180, నందికొట్కూరు-40, కొత్తపల్లి-200, గడివేముల-120, బండి ఆత్మకూరు-70, నందికొట్కూరు బాలికల కళాశాల వసతి గృహం-15, బాలుర కళాశాల వసతి గృహం-50, ఆత్మకూరు బాలురు-50, బాలికల వసతి గృహం-40, బీసీ ప్రీమెట్రిక్-650, బీసీ పోస్టుమెట్రిక్-150 మంది విద్యార్థులు ఉన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, కస్తూర్బా, మోడల్ స్కూల్స్, గురుకులం హాస్టల్స్ ప్రారంభమై 80 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు సరఫరా చేయలేదు. ఇంటి నుంచి దుప్పట్లు తెచ్చుకొని విద్యార్థులు వాడుకుంటున్నారు. గదులు, మరుగుదొడ్లు, మంచినీటి వసతులు సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలోని పాతబడిన భవనాలు తొలగించకపోవడంతో ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు.



కుంగిన బండపరుపు

బీసీ బాలుర వసతి గృహంలోని గదుల కిటికీలకు తలుపులేక విద్యార్థులు వర్షాకాలం, చలికాలంలో ఇక్కట్లు పడుతున్నారు. దోమల బెడదతో రాత్రిళ్లు నిద్రలేక అవస్థలు పడుతున్నారు. ఎస్సీ హాస్టల్‌లో వంటగది శిథిలావస్థలో ఉంది. కొత్తపల్లిలోని కస్తూర్బా హాస్టల్ ఎదుట మురుగునీరు నిల్వ ఉండటంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. పగిడ్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా లోని చాలా హాస్టళ్లకు కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు..

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వంటలు వండిపెట్టడానికి సరిపడా వంటవారులేక పోవడంతో విద్యార్థులు వంట మాస్టార్లుగా మారుతున్నారు. పాఠశాలలో 580మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా వారికి సరిపడా వంటలు వండే వంటవారు లేరు. ఎనిమిది మంది వంటవారు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులందరూ ఒకే పర్యాయం భోజనం చేసేందుకు సరిపడా డైనింగ్ హాలు లేకపోవటంతో ఓ తరగతి విద్యార్థులు భోజనం తిని వచ్చాకా మరో తరగతి విద్యార్థులు వెళ్లి తినిరావాల్సి వస్తుంది. దీంతో విద్యార్థులు డైనింగ్ హాలు వద్ద నిరీక్షించాల్సిన వస్తుంది. భోజనం వడ్డించేందుకు వంటవారు లేకపోవటంతో విద్యార్థులే మధ్యాహ్న భోజనం వడ్డించుకొని తినాల్సిన దుస్థితి నెలకొంది.



వసతిగృహం గదులకు ధ్వంసమైన కిటికీలు



నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్

మినరల్ వాటర్, ప్రహరీ ఏర్పాటు చేయాలి



వసతిగృహంలో రెండు నెలల క్రితం వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో మినరల్ వాటర్ లేకపోవడంతో బోరు నీటినే తాగుతున్నాం. వసతి గృహానికి ప్రహరీ లేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి. ఇక్కడి సమస్యల గురించి అధికారులందరికీ తెలుసుకు అయినా పట్టించుకోవడం లేదు.

– జయకృష్ణ, విద్యార్థి, ఆత్మకూరు

పాత భవనాలు కూల్చేయాలి

వసతి గృహ ప్రాంగణంలో పాడుబడిన భవనాలు ఎప్పుడు కూలుతాయోనని భయమేస్తోంది. ఆ భవనాలను తొలగించి కనీస వసతులు కల్పించాలి. మాకు సరిపడే ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– నరేష్, ఇంటర్మీడియెట్, ఎస్సీ హాస్టల్ నందికొట్కూరు



నందికొట్కూరులో కూలేందుకు సిద్ధంగా ఎస్సీ హాస్టల్ ఆవరణలోని భవనం



నందికొట్కూరు బీసీ వసతి గృహంలో సొంత దుప్పట్లపై నిద్రిస్తున్న విద్యార్థులు



భోజనశాలలో శిథిలమైన పైకప్పు



బాత్‌రూమ్‌లకు తలుపులు లేని దృశ్యం



భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

నందికొట్కూరు: పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి అన్నారు. గురువారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో మెప్మా ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ సమక్షంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత శిశు సంక్షేమ శాఖపై ఉందన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శాంతకుమారి, కౌన్సిలర్లు లాలు, రవూఫ్, మెప్మా ఆర్పీలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

పాములపాడు : పౌష్టికాహారం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగానహ కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు శివలక్ష్మమ్మ, నాగమ్మ, ఆశా వర్కర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

జూపాడుబంగ్లా: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకవిలువలు కలిగిన ఆహారం భుజించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని సూచించారు. గురువారం కాసానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

వెలుగోడు: పట్టణంలోని రోఖియాబీ దర్గా ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉస్మానియా ముస్లిం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతిరాం ఐ హాస్పిటల్ (కర్నూలు) సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 175 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 30 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని కంటి వైద్య నిపుణులు శేఖర్ తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో శాంతిరాం ఐ హాస్పిటల్ (కర్నూలు)కు తరలించి శస్త్రచికిత్స చేయిస్తామన్నారు. శిబిరంలో మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు.



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్

చాకలి ఐలమ్మ, రామకృష్ణకు నివాళి

ఆత్మకూరు: విద్యుత్ ఉద్యమంలో అసువులుబాసిన చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను కొనసాగిస్తామని ఏపీ రజక వృత్తిదారుల సంఘం గౌరవాధ్యక్షుడు పెద్ద వెంకటసుబ్బయ్య, జిల్లా కన్వీనర్ చందావారి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి శ్రీరాములు స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని గొల్లపేటలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ ఇవ్వాలని, లాండ్రీ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పెద్ద వెంకటస్వామి, చిన్న నారాయణ, రామకృష్ణ, రవి, సుంకన్న, శ్రీనివాసులు, రామకృష్ణ, సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎ.రణధీర్‌లు పాల్గొన్నారు.

వరిలో జింక్ లోపం లేకుండా చూసుకోవాలి

మహానంది: వరి పంటలో జింకు లోపించకుండా చూసుకోవాలని, ఎకరాకు ఇరవై కిలోల ముడి జింక్ ఆఖరి దమ్ములో వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ సూచించారు. ఆమె గురువారం నందిపల్లెలో వరి పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ సరళమ్మ మాట్లాడుతూ.. వరిపంటలో జీవన ఎరువుల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడొద్దని సూచించారు. వరి పంటలో నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త బాలునాయక్, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వినాయకా.. సెలవిక

శ్రీశైలంటెంపుల్: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఆయా ప్రదేశాలలో ఏర్పాటు చేసిన గణనాథులను గురువారం నిమజ్జనం చేశారు. క్షేత్ర పరిధిలోని శ్రీగిరికాలనీ, కొత్తపేట, యాదవ సత్రం, మేకలబండ, వ్యాపార సంఘం, వసతి విభాగం తదితర ప్రదేశాలలో నెలకొల్పిన గణనాథులకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నిమజ్జన పూజలు నిర్వహించి, లడ్డూ ప్రసాదాలను వేలం వేశారు. మొత్తం 36 చోట్ల గణేశ్ మండపాలు ఏర్పాటు చేయగా, 22 విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ జి.ప్రసాదరావు సిబ్బందితో బందోబస్త్ నిర్వ హించారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

మిడుతూరు: మండలపరిధిలోని పైపాలం గ్రామంలో వినాయకుడి నిమజ్జన వేడుకలను భజరంగ్ దళ్ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పైపాలం గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా వెళ్లి వినాయకుడిని నిమజ్జనం చేశారు. వినాయకుడి లడ్డూను మద్రి బజారు కుమారుడు నరేష్ రూ. 15,500లకు, కలశం మీద ఉన్న టెంకాయను రూ.3,900 లకు వెంకటేశ్వర్లు కుమారుడు సంతోష్ దక్కించుకున్నారు.



శ్రీశైలంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



పైపాలెంలో లడ్డూను దక్కించుకున్న నరేష్

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్ ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డివిజన్ కార్యాలయంలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్ నియామకం, నివేదిక ఆలస్యమవుతున్నందున 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్లు పి.దాసు, అబ్దుల్‌వహీద్, జిల్లా నాయకులు జక్కందాసు, కృష్ణుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ తగదు

వెలుగోడు: వక్ఫ్ బోర్డు చట్టాలను యథావిధిగా కొనసాగించాలని ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ముస్లిం మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టంలో సరవణలు చేయరాదని కోరారు. నాయకులు ఆరిఫ్, హుస్సేన్, మస్తాన్, సయ్యద్, మహమ్మద్ రఫీ, ఇలియాస్ ఖాన్, ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు.

వీబీఆర్‌కు 10,300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 10300 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 5 వేల క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో గురువారం 14.655 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు.

ఆస్పత్రి అవసరాలు తీరుస్తాం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పిస్తామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు భోజనశాల, బోరు, ఆర్‌ఓ ప్లాంట్‌ను సొంత నిధులతో పూర్తి చేస్తామన్నారు. 50 పడకల ఆస్పత్రిగా స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తామని, వైద్యుల కొరతను తీరుస్తామన్నారు. వార్డులో రోగులతో మాట్లాడి ఆరోగ్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ రాయుడు, సభ్యులు ఎంపీడీఓ మోహన్, మున్సిపల్ మేనేజర్ వెంకటేశ్వరగౌడ్, ఎన్‌జీఓ జుల్ ఫికర్ సమావేశం తీర్మానాలను ఆమోదించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి నుంచి 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. బోయ మద్దిలేటి తన ఇంటివద్ద మద్యం విక్రయిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

బండిఆత్మకూరు: పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్వాతి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 26,200 మందికిగాను 12,300 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నట్లు చెప్పారు. రైతులందరూ ఈ నెల 15వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని లేకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని చెప్పారు.

శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

నందికొట్కూరు: పట్టణంలోని సచివాలయాల పరిధిలో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. గురువారం పట్టణంలోని 1, 2, 6వ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సమస్యల పై సచివాలయానికి వచ్చిన వారిని గౌరవించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట నమోదు చేయించుకుంటేనే పరిహారం



తిమ్మాపురంలో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

మహానంది: అరటి సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని నంద్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు సూచించారు. మండలంలోని తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల పరిధిలో గురువారం మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్‌తో కలిసి అరటి తోటలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అరటి పంటలకు మండలాన్ని యూనిట్‌గా చేసుకొని బీమాను వర్తింపచేస్తున్నారని చెప్పారు. అరటి రైతులు తప్పనిసరిగా ఈ నెల 15వ తేదీలోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. బీమాతో పాటు పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన సమయంలో పరిహారం అందేందుకు దోహదపడుతుందన్నారు. మార్కెటింగ్, ప్రత్యేక రాయితీలు లాంటి లబ్ధి పొందాలంటే పంట నమోదు కీలకమని చెప్పారు. గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించి వెంటనే పంట నమోదు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వీఏఏ వసుంధర, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తడబ్బాల మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 15వేల తడి, పొడి చెత్త డబ్బాలు మంజూరైనట్లు ఎంపీడీఓ సూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తరుపున ఒక్కో డబ్బా ఖరీదు రూ.65.8 చొప్పున రూ.9,87,000ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. తర్తూరు, మండ్లెం, భాస్కరాపురం, తంగడంచ, జూపాడుబంగ్లా, పారుమంచాల, తూడిచెర్ల, తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, తరిగోపుల, పి.లింగాపురం గ్రామాల్లో చెత్తసేకరణ నిమిత్తం ప్రతి కుటుంబానికి రెండు డబ్బాల చొప్పున 15వేల డబ్బాలు మంజూరైనట్లు తెలిపారు. వీటిని సత్వరమే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్రజలకు అందజేయనున్నట్లు తెలిపారు.



జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో నిల్వ ఉంచిన తడి, పొడి చెత్త సేకరణ డబ్బాలు

సీపీఎం విరాళాల సేకరణ

ఆత్మకూరు: విజయవాడలో వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు ఎ.సురేంద్ర, సద్దాంహుసేన్ విజ్ఞప్తి చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక స్నేహ స్టడీ సర్కిల్‌లో గురువారం విరాళాలను సేకరించారు. విజయవాడలో జల విలయానికి దాదాపు 60 మంది చనిపోయారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. ఇళ్లలోని సరుకులు పనికి రాకుండా పోయాయన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అందించాలని కోరారు. సీపీఎం నాయకులు గణపతి, ఉసేని తదితరులు ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

జూపాడుబంగ్లా: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయపద్ధతులు అవలంభించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తరిగోపుల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలన్నారు.